సాక్షి
జగిత్యాల
శనివారం | 27 | మే | 2023



శిక్షణలో కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: హైదరాబాద్‌లో కలెక్టర్లకు ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు.



రాజన్నా నీవే రక్ష

వేములవాడ: రాజన్నను శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు పొడిగా, ఎండగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలతో క్రీడాకారులు

జగిత్యాల: ఖమ్మం జిల్లాలో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. సబ్బ మనూష 10 కి.మీ. రేస్‌వాకింగ్‌లో బంగారు పతకం సాధించగా, 5 కి.మీ. విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్‌మెడల్ సాధించింది. సబ్బ వసంత 20 కి.మీ రేస్‌వాకింగ్‌లో బంగారు పతకం సాధించగా, సౌమ్య 20 కి.మీ వాకింగ్‌లో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్‌మెడల్ గెలుచుకుంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముత్తయ్యరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అంజయ్య, కొమురయ్య తదితరులు క్రీడకారులను శుక్రవారం అభినందించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు



వైకుంఠధామం పరిశీలిస్తున్న దేవరాజు

పెగడపల్లి(ధర్మపురి): గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు సూచించారు. ఆరవెల్లి, బతికపల్లి, సుద్దపల్లి, పెగడపల్లి, దోమలకుంట గ్రామాల్లో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పల్లె ప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులు తనిఖీ చేశారు. వననర్సరీలు, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు పరిశీలించారు. పెగడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీవో మహేందర్, సర్పంచులు శోభారాణి, శ్రీనివాస్, లక్ష్మణ్, హారిక, నిహారిక, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, కిరణ్, నదీం, వంశీవర్ధన్, ప్రేమలత పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాల: జిల్లాలో రెండోవిడత గొర్రెల పంపిణీకి సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన గొర్రెల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మకరంద్ మాట్లాడుతూ, జిల్లాలో రెండో విడతలో 3,612 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారుల వివరాలు ఇ-లాబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసినటు ఆయన తెలిపారు. లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటాధనం రూ.43,750 వ్యక్తిగత బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లిస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులకు సంబంధించిన ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, నామినీ వివరాలు, కుల ధ్రువీకరణ పరిశీలనను మండల టీమ్‌లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా తరఫున ఈసారి ప్రొక్యూర్‌మెంట్ అధికారులుగా నియమించిన అధికారులు.. గొర్రెలు కేటాయించిన కర్నూలు, బీదర్, గుంటూరులో పర్యటిస్తారన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రొక్యూర్‌మెంట్, సెంట్రల్ ప్రోక్యూర్‌మెంట్ పారదర్శకంతో అవకతవకలకు ఆస్కారం లేకుండా, లబ్ధిదారులు సంతృప్తి చెందేలా గొర్రెలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి డీడీ గోపాలకృష్ణమూర్తి, ఏడీ నరేశ్ పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం



ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టును రంగురంగుల పూలతో అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసచార్యుల మంత్రోచ్చారణలతో లక్ష్మీహవన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వరిదే అగ్రస్థానం

- తర్వాతి స్థానంలో మొక్కజొన్న
- జిల్లా సాగు విస్తీర్ణం 4.42 లక్షల ఎకరాలు
- సాగు ప్రణాళిక ఖరారు చేసిన జిల్లా వ్యవసాయ అధికారులు

వానాకాలం ప్రణాళిక ఇలా

పంట	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
వరి	2,98,000
పత్తి	19,745
కంది	5,125
మొక్కజొన్న	40,375
పసుపు	18,750
పెసర	300
మినుము	675
సోయాబీన్	1,875
చెరుకు	1,200
ఆయిల్‌పామ్	4,800
ఇతర	36,250



జగిత్యాలఅగ్రికల్చర్: ఈ వానాకాలంలోనూ జిల్లా రైతులు వరి సాగు వైపే దృష్టి పెడతారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ సీజన్‌లో పండించే పంటలు, అవసరమైన రసాయన ఎరువులు, రాయితీ విత్తనాలపై ప్రణాళిక రూపొందించింది. రైతులు, అధికారులను అప్రమత్తం చేసేలా శుక్రవారం ప్రణాళిక విడుదల చేసింది.

సాగు విస్తీర్ణం 4.42 లక్షల ఎకరాలు..

- జిల్లాలో ఈసారి 4.42 లక్షల ఎకరాల్లో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు, కంది సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు.
- ఎప్పటిలాగే ఈసారి కూడా అత్యధికంగా వరి 2.98 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండిస్తారని భావిస్తున్నారు.
- ఆ తర్వాత మొక్కజొన్న పంట పండిస్తారని పేర్కొన్నారు. అయితే, జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3.35 లక్షల ఎకరాలు ఉండగా, ఈ ఏడాది అదనంగా 1.05 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేశారు.

1.08 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు..

పంటలకు అవసరమైన రసాయన ఎరువులు నెల వారీగా జిల్లాకు సరఫరా కానున్నాయి. జూన్‌లో 22,163 మెట్రిక్ టన్నులు, జూలైలో 30,674 మెట్రిక్ టన్నులు, ఆగస్టులో 33,253 మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 22,163 మెట్రిక్ టన్నుల రసాయన ఎరువులు జిల్లాకు చేరేలా ప్రణాళిక రూపొందించారు.

76,095 క్వింటాళ్ల విత్తనాలు..

రైతుల అవసరాల మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది.

అవసరమైన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

యూరియా	40,797
డీఏపీ	11,699
మ్యూరేట్ ఆఫ్ పొటాష్	10,257
కాంప్లెక్స్	45,500
సింగిల్ సూపర్ పాస్ఫేట్	4,763

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం..

- వరి సాగు చేసే పొలాల్లో తొలుత పచ్చిరొట్ట సాగు కోసం జనుము, జీలుగ విత్తనాలను రైతులు పండిస్తారు.
- ఈ మేరకు జిల్లాకు అవసరమైన 13,300 క్వింటాళ్ల జీలుగ, 1,200 క్వింటాళ్ల జనుము విత్తనాలను 65 శాతం రాయితీపై రైతులకు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఆ మేరకు జిల్లాకు విత్తనాలు కేటాయించింది.
- రాయితీ మినహా మిగతా సొమ్ము రైతులు చెల్లించాల్సి ఉంది. సబ్సిడీ విత్తనాలు జిల్లాలోని సింగిల్‌విండోలు, ఆగ్రోస్, డీసీఎమ్మెస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతారు.

క్లస్టర్‌లో ప్రదర్శన క్షేత్రాలు..

జిల్లాలోని ప్రతీ క్లస్టర్ పరిధిలో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసి రైతులను చైతన్యం చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రతీ గ్రామంలో వరినారు పెంపకంపై ఈనెల 25 నుంచి జూన్ 10వతేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

విత్తనాల వివరాలు(క్వింటాళ్లలో)

పంట	విత్తనాలు
వరి	74,635
కంది	257
మొక్కజొన్న	3,230
పెసర	18
సోయాబీన్	562.5
పత్తి(ప్యాకెట్లు)	40,000

ఉన్నతాధికారులకు నివేదిక



వానాకాలంలో రైతులు సాగుచేసే పంటల వివరాలతోపాటు అవసరమయ్యే రసాయన ఎరువులు, విత్తనాల కోసం ప్రణాళిక రూపొందించాం. నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించాం. ఆ మేరకు ఏర్పాట్లు చేశాం. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తూ, రైతులకు దిశానిర్దేశం చేస్తాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

399 విత్తన విక్రయ కేంద్రాలను పోలీసులతో కలిసి వ్యవసాయాధికారులు తనిఖీ చేస్తారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

‘పోడు’ ఆశలు ఆవిరి



కథలాపూర్‌లో పోడు భూమి

- 2వేల దరఖాస్తులు
- 19 ఎకరాలు.. 15 మంది అర్హులు

కోరుట్ల: పోడు భూముల్లో పట్టాలు ఇచ్చేందుకు సాగుతున్న కసరత్తు దాదాపుగా కొలిక్కివస్తోంది. అటవీ భూముల్లో సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించగా వచ్చిన దరఖాస్తుల్లో కేవలం ఒక్కశాతం మాత్రమే అర్హులు ఉన్నట్లు రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో చేసిన సర్వేలో తేల్చినట్లు సమాచారం. ఈ మేరకు పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి.

పోడు భూములు అంటే..?

- పోడు భూముల సమస్య చాలాఏళ్లుగా నలుగుతోంది.
- అడవుల సమీపంలో నివాసం ఉండే గిరిజనులు, గిరిజనేతరులు పరిసరాల్లోని అటవీ భూముల్లో చెట్లను కొట్టేసి జొన్నలు, సజ్జలు తదితర చిరుధాన్యాలు, ఇతరత్రా పంటలు సాగు చేయడాన్ని పోడు సాగు అంటారు.
- ఈ సాగు కొనసాగుతున్న భూములను పోడు భూములని పిలుస్తారు.
- ఈ రీతిలో జిల్లాలో సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, ధర్మపురి మండలాల్లో పోడు వ్యవసాయం సాగుతున్న భూములు ఉన్నాయి.
- వీటిపై తమకు హక్కులు కల్పించాలని చాలాఏళ్లుగా రైతులు కోరుతున్నారు.
- ఇప్పటివరకు ప్రభుత్వపరంగా స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో అటవీ అధికారులు సందిగ్ధంలో ఉండిపోయారు. అయితే, ఇటీవల ప్రభుత్వం పోడు భూములు సర్వే చేసి అర్హులైన వారికి హక్కుపత్రాలు ఇవ్వాలని మార్గదర్శకాలు జారీచేయడంతో ఆ పనుల్లో నిమగ్నమయ్యారు.
- దీంతో పోడు సాగు చేస్తున్న రైతులు హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పారదర్శకంగా సర్వే

పోడు భూముల్లో హక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించాం. గ్రామ సభలు నిర్వహించి ఆ ప్రకారమే అర్హులను నిర్ధారించాం. అర్హుల ఎంపిక పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాం.

– వెంకటేశ్వర్రావు, డీఎఫ్‌వో, జగిత్యాల

2 వేల దరఖాస్తులు..

జిల్లాలో పోడు వ్యవసాయం సాగుతున్న మండలాల నుంచి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ సుమారు 2 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ దరఖాస్తులను పరిశీలించి పోడుహక్కు పత్రాలు ఇవ్వడానికి అధికారులు సన్నాహాలు చేశారు. ఇప్పటివరకు అటవీ అధికారులు.. ఆయా మండలాల్లో దరఖాస్తులు చేసుకున్న గిరిజన, గిరిజనతరులు క్షేత్రస్థాయిలో ఎన్నేళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నారన్న అంశాలను పరిశీలించి సుమారు 15 మందిని అర్హులుగా గుర్తించారు. వారు 19 ఎకరాల భూమిలో మాత్రమే పోడుహక్కు పత్రాలు పొందడానికి అర్హులుగా తేల్చినట్లు సమాచారం.

అర్హుల గుర్తింపు ఎలా..?

2006 పోడు భూముల హక్కుల చట్టం కన్నా ముందుగా.. అంటే 2005 డిసెంబర్ 13వ తేదీ వరకు అటవీ భూముల్లో పోడు సాగు చేసుకున్న రైతులు పోడు భూముల్లో పట్టాలు పొందడానికి అర్హులుగా నిర్ధారించారు. గిరిజనేతరులైతే 70 ఏళ్లుగా పంటలు పండిస్తూ ఉండాలని మార్గదర్శకాల్లో సూచించారు.

ధాన్యంలో కోతలపై రైతుల ఆగ్రహం



సింగిల్‌విండో చైర్మన్‌తో రైతుల వాగ్వాదం

- సింగిల్‌విండో చైర్మన్‌తో వాగ్వాదం

వెల్గటూర్(ధర్మపురి): నలభై రోజులు దాటినా ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగడం లేదని, కొనుగోళ్లలో ఇష్టానుసారం కోత విధిస్తున్నారని ఆగ్రహిస్తూ పాశిగామ రైతులు శుక్రవారం తిమ్మాపూర్ సహకార సంఘం చైర్మన్‌తో వాగ్వాదానికి దిగారు. తిమ్మాపూర్ సహకార సంఘం పరిధిలోని పాశిగామ కేంద్రంలో కొనుగోళ్ల ప్రారంభంలో బస్తాకు 42 కేజీలతో కొనుగోలు చేస్తామని నిర్వాహకులు అగ్రిమెంట్ రాసిచ్చారని తెలిపారు. సంఘం చైర్మన్ కొనుగోలు కేంద్రానికి వచ్చి మిల్లర్లు 43 కేజీల తూకం ఉంటేనే కొనుగోలు చేస్తామని అంటున్నారని, లేదంటే వడ్లు తూర్పారబడితే 40.800 గ్రాములతో చివరిగింజ వరకూ కోతలు లేకుండా కొనుగోలు చేస్తామని చైర్మన్ అంగీకరిచార న్నారు. మళ్లీ 43.500 కేజీలతో కొనుగోలు చేస్తామని, లేకుంటే ధాన్యం కొనుగోలు చేయడం తమవల్ల కాదని చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 రోజులు గడిచినా ఇప్పటికీ 60 శాతం కొనుగోలు కూడా పూర్తికాలేదని ఆవేదన చెందారు. లారీలు రావడం లేదనే సాకుతో మళ్లీ కొనుగోళ్లు నిలిపివేశారని మండిపడ్డారు. రైస్‌మిల్లర్లు అడ్డగోలుగా దోచుకుంటున్నా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. చివరికి పైఅధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన చెప్పడంతో రైతులు శాంతించారు.

3న గోదావరికి హారతి

- రాష్ట్ర కన్వీనర్ లింగంపల్లి వీరగోపాల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: గోదావరి హారతి యాత్రను విజయవంతం చేయాలని గోదావరి మహాహారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపల్లి వీరగోపాల్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కార్యక్రమ ప్రచార పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కందకుర్తిలో జూన్ 3న యాత్ర ప్రారంభిస్తామన్నారు. జూన్ 8న ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం యాత్ర చేరుకుంటుందని అన్నారు. గోదావరి హారతి వ్యవస్థాపక చైర్మన్ మురళీధర్‌రావు నేతృత్వంలో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జలవనరుల పరిరక్షణ దిశలో ప్రజలను సమాయత్తం చేయడంతోపాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం యాత్ర ఉద్దేశమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. గోదావరి జలవనరులు కలుషితం కాకుండా చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ యాత్ర కొనసాగుతుందన్నారు. సుమారు 800 కి.మీ వరకు గోదావరి తీరప్రాంతాల్లోని 285 గ్రామాల గుండా యాత్ర సాగుతుందని తెలిపారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండాపూర్‌లో జూన్ 5న యాత్ర ప్రవేశించి ధర్మపురిలోని రాయపట్నం వద్ద ముగుస్తుందని వివరించారు. అనంతరం మంచిర్యాల జిల్లాకు ప్రవేశిస్తుందని చెప్పారు. ధర్మపురిలో గోదావరితల్లి నదికి హారతి నిర్వహిస్తామని అన్నారు. గోదావరి హారతి నిర్వాహకులు వెంకటరమణ, నర్సయ్య, పద్మాకర్, సత్యం, ఆముదరాజు పాల్గొన్నారు.

వేగంగా ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న రామానుజాచాచారి

రాయికల్(జగిత్యాల): సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని జిల్లా సహకార సంఘం అధికారి రామానుజాచారి సూచించారు. భూపతిపూర్, ఇటిక్యాల, వీరాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రైస్‌మిల్లర్లు ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఫౌండేషన్ కోర్సుల ఫలితాలు విడుదల

జగిత్యాల: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లాస్థాయి స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్, బ్యాంకులు, రైల్వేలు, కేంద్ర ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఐదునెలల ఫౌండేషన్ కోర్సు శిక్షణ కోసం చేపట్టిన పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు సంక్షేమాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్, ఫలితాలు, జనరల్ మెరిట్, ఎంపిక జాబితాను స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in అందుబాటులో ఉన్నాయన్నారు. జాబితాలో పేరు ఉన్నఅభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 29, 30, 31 తేదీల్లో స్టడీ సర్కిల్‌లో ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

‘గృహలక్ష్మి’ వరమా.. భారమా?

- ఇంటి జాగా ఉన్న బీదలకు రూ. 3లక్షలు
- పీఎంఏవై రూ.2 లక్షలు తోడైతే పూర్తిస్థాయి రేకుల ఇల్లు
- నిర్మాణ రంగంపై పెరిగిన బొగ్గు ధరల ప్రభావం
- చదరపు అడుగుకు రూ.1,500 నుంచి రూ.2వేలకు పెంపు
- ఉమ్మడి జిల్లాలో 36 వేల మందికి రూ.10 కోట్లు అవసరం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గృహలక్ష్మి పథకం సొంతింటి జాగా కలిగిన ఇల్లులేని పేదలకు వరమేనని బిల్డర్లు అంటున్నారు. రోజురోజుకు నిర్మాణ వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నేపథ్యంలో ఇల్లు కట్టుకునేందుకు జంకుతున్న నిరుపేదలకు ఈ పథకం అనుకూలమని నిర్మారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. ఖర్చు నిర్దేశించుకుని నిర్మాణం చేపడితే.. సకాలంలో పూర్తవడమే కాకుండా.. తక్కువ బడ్జెట్‌లో ఇల్లు చేతికి వస్తుందని అంటున్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకానికి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ (పీఎంఏవై) పథకం తోడైతే.. ఇంటి నిర్మాణం మరింత సులువు అవుతుందని వివరిస్తున్నారు.

భారీగా పెరిగిన వ్యయం

కరోనా తర్వాత నిర్మాణ రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని ప్రతీ నిర్మాణ రంగానికి మూలమైన ఇటుకల ధర భారీగా పెరిగింది. ప్రతీ జిల్లాలోని ఇటుకల తయారీకి ప్రధాన వనరు అయిన ఎన్టీపీసీ ఫ్లైయాష్‌ను టెండర్లకు ఇవ్వడం ఇందుకు ప్రధాన కారణం. తద్వారా ఒకప్పుడు అక్కడ 30 టన్నుల బూడిదలారీని రూ.700కి ఇచ్చేవారు. ప్రస్తుతం అది రూ.12,000లకు చేరింది. ఫలితంగా ఇటుక ధరలు పెరిగాయి. ఫలితంగా రాష్ట్రంలో ప్రతీ ఇంటి నిర్మాణంపైనా దాదాపు రూ.30 వేల అదనపు భారం పడుతోంది. ఇటీవల బొగ్గు ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. దీంతో ఇటుకల పరిశ్రమలో ఉత్పత్తి చేసిన ఇటుకలను కాల్చేందుకు ఊక (ఉనుక)తోపాటు బొగ్గును వాడుతారు. దాని ప్రభావం ఇటుకల ధరలపై పడుతోంది. బొగ్గు ధరల ప్రభావం స్టీలుపైనా ఉందంటున్నారు. ఫలితంగా 2021 వరకు రూ.7లుగా ఉండే మట్టి ఇటుక ధర ప్రస్తుతం రూ.9 నుంచి రూ.10వేలకు చేరుకోవడం వెనక కారణం ఇదే.

పీఎంఏవై జత కలిస్తే..

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం.. చదరపు అడుగుకు రూ.2000 వరకు బిల్డర్లు వసూలు చేస్తున్నారు. కరోనాకు ముందు ఇది రూ.1500గా ఉండేది. ఒక మధ్య తరగతి కుటుంబం పిల్లర్లు వేసి 800 చదరపు అడుగుల డబుల్ బెడ్ ఇంటిని నిర్మించుకుంటే.. దాదాపుగా రూ.16 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇదే గృహలక్ష్మి పథకంలో నిర్మాణం చేపడితే.. రూ.3 లక్షలు ఏ మూలకు సరిపోవు. ఇక్కడే నిర్మాణరంగ నిపుణులు మరో ఆలోచన ముందుంచుతున్నారు. నివాసగృహం లేని వారంతా ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) కింద దరఖాస్తు చేసుకుంటే మరో రూ.2లక్షలు కూడా వస్తాయని గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలకు కేంద్రం నుంచి వచ్చే రూ.2 లక్షలు జతకలిస్తే ప్రతీ లబ్ధిదారునికి కొండంత అండగా ఉంటుందని సలహా ఇస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. పేదింటిని 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.3లక్షలతో డబుల్ బెడ్‌రూం, హాల్, కిచెన్‌తో కూడిన రేకులషెడ్ నిర్మాణం చేయవచ్చు. మిగిలిన రూ.2లక్షలతో తలుపులు, కిటికీలు, లోపల షెల్ఫులు, సీలింగ్ కూడా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అదే మధ్య తరగతి కుటుంబాలు ఈ రూ.5 లక్షలకు మరికొన్ని డబ్బులు కలుపుకుని, లేదా బ్యాంకు రుణాలు తీసుకుని సొంతింటి కలను నెలవేర్చుకోవచ్చని వివరిస్తున్నారు.

36 వేల మందికి రూ.10 కోట్లు అవసరం..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలుగా వర్గీకరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు కొత్త జిల్లాల పరిధిలో మాత్రం 12ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ప్రతీ నియోజకవర్గానికి 3000 మంది లబ్ధిదారుల చొప్పున మొత్తం 36,000 మందిని ఎంపిక చేస్తారు. వీరికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయడానికి ప్రభుత్వం మొత్తం రూ.10.08 కోట్లు నిధులు కావాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కథలాపూర్(వేములవాడ): పెగ్గెర్ల గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు రాంగ్ కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు. కొత్త యాప్ లింకులు వస్తే స్పందించవద్దని సూచించారు. ఫోన్ పే, గూగుల్ పే వినియోగించేటప్పుడు ఇతరులకు పిన్ తెలియకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఏమరుపాటుగా ఉంటే మోసపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఎండీ అలీమొద్దీన్, సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నీలా నాయక్, మదన్‌లాల్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని ఇందిరానగర్ శివారులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నిర్మానుష్య ప్రదేశంలో వ్యక్తి పడి ఉండడాన్ని గమనించిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకొని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సుమారు 50సంవత్సరాలు వయసు ఉన్న ఆ వ్యక్తి లుంగీ, టీ షర్ట్ ధరించి ఉన్నాడు. వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేట శివారులో ఇద్దరు రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు బాధితులు శుక్రవారం తెలిపారు. చింతకుంట గ్రామంలోని తరి అంజయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి భూషణరావుపేట శివారులో ఉంది. ఆ బావికి బిగించిన మోటార్, స్టార్టర్ బాక్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. భూషణరావుపేటలోని రైతు తీట్ల శంకర్‌కు చెందిన విద్యుత్ మోటారును దొంగలు ఎతుకెళ్లారు. చోరీలతో రైతులకు సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లింది. బాధితరైతు తరి అంజయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృత్యువాత

ధర్మపురి: మేత కోసం వెళ్లిన గొర్రెలు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. కమలాపూర్ గ్రామానికి చెందిన కానగంటి కొమురయ్య తన గొర్రెలను మేత కోసం శుక్రవారం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అక్కడి వ్యవసాయ భూమిలో విద్యుత్ వైరు తెగి పడి ఉంది. దానిని తాగిన రెండు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతు కోరాడు.

దాడి కేసు నమోదు

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్ గ్రామానికి చెందిన దబ్బెట భానుచందర్‌పై కుటుంబ కలహాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన దమ్మాల రాకేశ్, దమ్మాల వెంకటేశ్, దమ్మాల నర్సమ్మ, రవళి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత పరికరాలు.. అసౌకర్యాలు

- పేదలకు అందని నేత్ర శస్త్రచికిత్సలు



ఆపరేషన్ రూమ్ ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్(ఫైల్)

జగిత్యాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నేత్ర వైద్యులు ఉన్నా.. ఒక శస్త్ర చికిత్స కూడా జరగలేదు. పేదలకు కనీసం నేత్ర చికిత్సలు అందడం లేదు. తాజాగా మాతా శిశు సంక్షేమ కేంద్రంలో కంటి శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేకంగా గది కేటాయించారు. ఇటీవల మంత్రి కొప్పుల ఈశ్వర్ దానిని ప్రారంభించారు. గతంలో కంటి వైద్యుడు ఉన్నా, వివిధ సమస్యలతో రెండేళ్లుగా ఆపరేషన్లు నిర్వహించడం లేదు. ఇప్పటిదాకా కేవలం నేత్ర పరీక్షలు మాత్రమే చేసేవారు. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఏర్పాటు చేసిన నేత్రశస్త్ర చికిత్సల విభాగంతోనైనా పేదలకు కంటి ఆపరేషన్లు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నారు. తొలివిడత కంటివెలుగు కార్యక్రమం నిర్వహణ కోసం ఆస్పత్రిలో ప్రత్యేకంగా గది కేటాయించాలని, వైద్య పరికరాలు అందుబాటులోకి తేవాలని వైద్యాధికారులు సూచించినా అలాంటి చర్యలేమీ తీసుకోలేదు. దీంతో వైద్యులు కేవలం కంటివైద్య పరీక్షలకే పరిమితమవుతున్నారు. జిల్లాతోపాటు మంచిర్యాల, లక్సెట్టిపేట, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి వివిధ సమస్యలతో బాధపడుతు పేదలకు పెద్ద ఎత్తున జగిత్యాలకే వస్తారు. కానీ, ఇక్కడ ఆపరేషన్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పరికరాలు కరువు..

- ప్రస్తుతం నేత్ర శస్త్రచికిత్సల విభాగాన్ని జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంక్షేమ కేంద్రంలో ఏర్పాటు చేశారు.
- ఇందులో ఆపరేషన్లకు అవసరమైన పరికరాలు లేవు.
- గతంలో ఉన్నవాటినే ఉంచారు.
- ప్రస్తుతం పాత మైక్రోస్కోప్ మాత్రమే ఉంది. వనపర్తి వైద్య కళాశాల నుంచి కొత్త మైక్రోస్కోప్ తెప్పించేందుకు యత్నిస్తున్నారు.
- కొత్త మైక్రోస్కోప్ లేక శస్త్ర చికిత్సలు చేయడం ఇబ్బందిగా ఉందని వైద్యులు తెలిపారు.
- మరోవైపు.. నేత్ర శస్త్రచికిత్సల కోసం కేటాయించిన గదులను స్టెరిలైజేషన్ చేసి 15 రోజుల్లో అందుబాటులోకి తెస్తామని వైద్యాధికారులు తెలిపారు.

పేదలకు ప్రైవేటే దిక్కు..

కంటి సమస్యలతో బాధపడే పేద వర్గాలకు చెందిన మహిళలు, వృద్ధులు వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికే వస్తున్నారు. ఇక్కడ ప్రత్యేక గదులు లేక ఆపరేషన్లు చేయడంలేదు. దీంతో వారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జిల్లా ఆస్పత్రిలో కంటి విభాగానికి ప్రత్యేక గది కేటాయించారు. సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. కానీ, పరికరాలు వస్తే తప్ప శస్త్ర చికిత్సలు జరిగే పరిస్థితి కనిపించడంలేదు.

కొత్త పరికరాలు తెప్పిస్తున్నాం

నేత్రశస్త్ర చికిత్స కోసం కొత్త పరికరాలు తెప్పిస్తున్నాం. వనపర్తి మెడికల్ కాలేజీ నుంచి కొత్త మైక్రోస్కోప్ పరికరం వస్తుంది. 15 రోజుల్లో శస్త్రచికిత్సలు మొదలవుతాయి. పేదలకు ఇబ్బందులు ఉండవు. సేవలు సద్వినియోగం చేసుకోవాలి.

– రాములు, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, జగిత్యాల

ఒబులాపూర్‌లో అగ్నిప్రమాదం

- బలమైన గాలులతో రాపిడీకి గురైన విద్యుత్ తీగలు
- ఆ వెంటనే చెలరేగిన మంటలు
- నిప్పురవ్వలు అంటుకుని దగ్ధమైన గడ్డికట్టలు



మంటలు అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్లాపూర్(కోరుట్ల): ఒబులాపూర్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలోని పంట పొలాలకు వ్యాపించాయి. నిల్వ ఉంచిన గడ్డికట్టలు కాలిబూడిదయ్యాయి. నాయకుడు తోట రాజరెడ్డి, రైతులు, గ్రామస్తులు ఘటనస్థలికి వెళ్లి నీళ్లతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. ఈదురుగాలులు ఎక్కువ కావడంతో మంటలు విస్తరించాయి. దీంతో మెట్‌పల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడ ఫైరింజన్ అందుబాటులో లేక ఒబులాపూర్ సమీపంలోని నిర్మల్ జిల్లా ఖానాపూర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఫైర్‌స్టేషన్ అధికారి వెంకటేశ్వర్లు.. ఫైరింజన్ సిబ్బందితో వెంటనే ఘటనస్థలికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తేవడంతో నష్టం తీవ్రత తగ్గింది. రైతులు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలోని పొలాల మధ్య విద్యుత్ తీగలు ఈదరు గాలులకు రాపిడీకి గురై నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయన్నారు. దీంతోనే అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలిపారు. ఫైర్ అధికారులు సకాలంలో వచ్చి మంటలు అదుపులోకి తేవడతో సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి పెనుప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

కుటిల రాజకీయాలు తగదు

- ప్రతిపక్ష పార్టీల తీరు సరికాదు
- మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

కథలాపూర్(వేములవాడ): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుటీల రాజకీయాలు చేయడం తగదని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ధ్వజమెత్తారు. భూషణరావుపేటలో ఇటీవల దాడికి గురైన బీఆర్‌ఎస్ నాయకుడు బద్దం మహేందర్‌రెడ్డిని శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూషణరావుపేటలో ఓ రైతుకు చెందిన ధాన్యం తూకం వేసి రైస్‌మిల్లుకు తరలించాక సదరు రైతు అనవసరంగా ఆరోపణలు చేసి మహేందర్‌రెడ్డిపై దాడి చేశారన్నారు. మహేందర్‌రెడ్డిని రాజకీయంగా ఎదగకుండా చేయాలని కొందరు నాయకులు కుట్రలు పన్నారని ఆరోపించారు. దాడి చేసిన వ్యక్తిని కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరామర్శించి కుటీల రాజకీయాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఆ నాయకులకు ఇంగిత జ్ఞానంలేదని అర్థమైపోయిందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే రైతులకు మేలు జరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు స్వార్థరాజకీయాలు మానుకొని ప్రజలకు సేవచేయడంపై దృష్టి సారించాలని హితువు పలికారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపెల్లి గంగారెడ్డి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, నాయకులు గుండారపు గంగాధర్, పూండ్ర జనార్దన్‌రెడ్డి, కొత్తపెల్లి శ్రీనివాస్, గడ్డం శేఖర్‌రెడ్డి, సోమ దేవేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, ముస్కు శ్రీనివాస్, కల్లెడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు పోలీసు కార్యాలయ భవనం



చివరి దశకు చేరిన పోలీసు కార్యాలయ భవనం



ఎస్పీ నివాస భవనం

- ఆరేళ్ల తర్వాత కొలిక్కి వచ్చిన పనులు
- పర్యవేక్షించిన పోలీసు హౌసింగ్ కార్పొరేషన్

జగిత్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశంతో 2016 అక్టోబరు 11న ప్రభుత్వం కొత్త జిల్లాలు ప్రారంభించింది. తొలిదశలోనే కొత్త జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించారు. సంవత్సర తర్వాత కలెక్టరేట్, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి ధరూర్ క్యాంప్‌లో సుమారు 20.25 ఎకరాలు భూమిని కేటాయించారు. పనులు ప్రారంభించినా నత్తనడకన సాగాయి. సుమారు ఆరేళ్ల తర్వాత దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మరో నెలరోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.

ముమ్మరంగా పనులు..

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ నిర్మాణం ఆరునెలలుగా ముమ్మరంగా కొనసాగుతోంది. పనులు 80 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులను యుద్ధప్రాతిపాదికన చేస్తున్నారు. ఎస్పీ నివాస భవనం, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ భవనం పనులు కూడా పూర్తయ్యాయి.

కళాత్మకంగా కార్యాలయం భవనం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పోలీసు ప్రధాన కార్యాలయాలు కళాత్మకంగా ఉంటున్నాయి. నిజాం కాలం నాటి కళానైపుణ్యాన్ని ప్రతిబింబించేలా కట్టడాలు అందంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రధాన కార్యాలయంలో విద్యుత్, సీలింగ్ పనులు కొనసాగుతున్నాయి. మరో నెలరోజుల్లో పనులు పూర్తికాగానే ప్రారంభించేందుకు పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది.

పూర్తయిన డీఎస్పీ కార్యాలయం..

జగిత్యాల జిల్లా ఆవిర్భవించాక డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి కేటాయించారు. దీంతో కొత్త డీఎస్పీ కార్యాలయం కోసం ధరూర్ క్యాంప్‌లోనే స్థలం కేటాయించారు. అక్కడే ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకుంది. కార్యాలయం అక్కడే కొనసాగుతోంది. విశాలమైన భవనంతోపాటు, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. పనులు పూర్తికాగానే ప్రారంభిస్తామని తెలిపారు.

పాలిసెట్‌లో ప్రతిభ

- సత్తాచాటిన విద్యార్థులు



మాదా లక్ష్మీప్రసన్న



గుంటుక జాహ్నవి

జగిత్యాల: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు శుక్రవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. ఇందులో గాదె సహస్ర బైపీసీలో 20వ ర్యాంక్ సాధించగా, ఆవరి శరణ్య 67వ ర్యాంక్ సాధించింది. గుర్రాల మేధా 91వ ర్యాంక్ సాధించి జిల్లాలో టాప్– 3లో నిలిచారు.

కోరుట్లలో..

కోరుట్లరూరల్: కల్లూరు శివారు మోడల్ స్కూల్ విద్యార్థిని మాదా లక్ష్మీప్రసన్న ఎంపీసీ విభాగంలో 435వ ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య తెలిపారు. లక్ష్మీప్రసన్నను ప్రిన్సిపాల్ నర్సయ్యతోపాటు అధ్యాపకులు రమేష్, ప్రవీణ్, శ్రీధర్, లక్ష్మణ్ అభినందించారు.

జాహ్నవి ప్రతిభ

కోరుట్ల: పట్టణానికి చెందిన గుంటుక జాహ్నవి 641వ ర్యాంకు సాధించింది. జాహ్నవి మహాత్మా జోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుకుంది. ఆమెను తండ్రి రఘువీర్ తదితరులు అభినందించారు.

మల్యాలకు చెందిన విద్యార్థి..

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రానికి చెందిన జవ్వాజి సాత్విక్ 1,233 ర్యాంకు సాధించాడు. ప్రధానోపాధ్యాయురాలు రజిత, పలువురు సాత్విక్‌ను అభినందించారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

- మానసిక స్థితి బాగోలేక బలవన్మరణం



రింజుదేవి(ఫైల్)

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామంలో రింజుదేవి (32) అనే వివాహిత శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు, బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్‌గుప్తా ఆరేళ్ల కిత్రం జయ్యారం గ్రామానికి ఉపాధికోసం వచ్చాడు. ధర్మారం క్రాస్‌రోడ్డులోని బోడగుట్ట స్టోన్ క్రషర్‌లో క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దినేష్ గుప్తా భార్య రింజుదేవి మానసిక స్థితి మూడేళ్లుగా బాగుండడం లేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఎలాంటి మార్పులేదు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున దినేష్‌గుప్తా స్నానం చేస్తుండగా ఇంటి నుంచి బయటకు వచ్చిన రింజుదేవి గ్రామశివారులోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన భార్య ఇంట్లో కనిపించకపోవడంతో దినేష్‌గుప్తా గ్రామంలో వెతకగా స్థానికులు అందించిన సమాచారంతో ఎల్లమ్మ ఆలయం వైపు వెళ్లాడు. అనుమానంతో బావిలోకి చూడగా శవం తేలియాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులకు సమాచారం అందించడంతో వారు బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిమృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీకి చెందిన బానోతు రాయమల్లు కొన్నిరోజుల క్రితం సెల్‌ఫోన్ పోవడంతో రామగుండం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ నేపథ్యంలో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను గుర్తించి శుక్రవారం బాధితుడికి రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్ ఫోన్ తిరిగి అప్పగించడంతో బాధితుడు రాయమల్లు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామగుండం ఎస్సై బత్తుల శరణ్య ఉన్నారు.

‘మనోభావాలు దెబ్బతీసే వారిపై చర్య తీసుకోండి’



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆర్యవైశ్యులు

ధర్మపురి: తమ మనోభావాలను కించపర్చేలా ఓ పత్రికలో కథనం ప్రచురించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలో కొందరు మహిళలు ఐక్యంగా ఉంటూ కిట్టీ పార్టీలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, ఇలాంటి పార్టీలతో మోసాలకు పాల్పడుతూ, ఆర్థికంగా నష్టాలు కలిగిస్తున్నారని శుక్రవారం ఓ పత్రికలో(సాక్షి కాదు) వార్త ప్రచురితమైందన్నారు. ఇక్కడితో ఆగకుండా ఆ వార్తను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈమేరకు సుమారు 25 కుటుంబాలకు చెందిన ఆర్యవైశ్యులు ఏకమై తమ పరువుకు భంగం కలిగించారని పేర్కొంటూ సీఐ కోటేశ్వర్, ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

ప్రజారోగ్యం మెరుగుపర్చడం లక్ష్యం

- జిల్లాలో జన ఆరోగ్య సమితులు
- అత్యవసర వినియోగ నిధులు రూ.50 వేలకు పెంపు

నిధుల కేటాయింపు..

వెల్‌నెస్ కేంద్రం స్థాయి	రూ.50,000
మండలస్థాయి పీహెచ్‌సీకి	రూ.1,75,000
సీహెచ్సీ స్థాయి	రూ.2,25,000



మెట్ల చిట్టాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రాయికల్(జగిత్యాల): ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపర్చటానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఉపకేంద్రాల స్థాయిలోని గ్రామ పారిశుధ్య కమిటీ, మండల స్థాయిలోని ఆస్పత్రి అభివృద్ధి సమితిని ‘జన ఆరోగ్య సమితి’గా మార్చింది. పీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలల్లో ఇప్పటివరకు ఉన్న ఆస్పత్రి అభివృద్ధి సమితి స్థానంలో ‘రోగి కల్యాణ సమితి’గా మార్చింది. గ్రామ స్థాయి పారిశుధ్య కమిటీకి గతంలో కేవలం రూ.10 వేలు మాత్రమే మంజూరయ్యేవి. ప్రస్తుతం జన ఆరోగ్య సమితిగా మార్చి రూ.50 వేలు మంజూరు చేయనున్నారు. ఆయా వెల్‌నెస్ ఉప కేంద్రాల్లో కమిటీలను ఏర్పాటు చేయగానే ఈ నిధులు విడుదల చేస్తారు.

ఏటా నిధులు..

వెల్‌నెస్ కేంద్రం, మండల, పట్టణ స్థాయి పీహెచ్‌సీలకు ప్రతీ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఆస్పత్రిలో అత్యవసరమైన మందుల కొనుగోళ్లు, అప్పటికప్పుడు చేపట్టే పారిశుధ్య పనులు, భవనాల అత్యవసర మరమ్మతులు తదితర అవసరాలకు ఈ నిధులు మంజూరు చేస్తారు. పీహెచ్‌సీ, సీహెచ్సీలకు గతంలో లాగే నిధులు విడుదల కానున్నాయి.

నిధుల పెంపుతో ప్రయోజనం

గ్రామ వెల్‌నెస్ కేంద్రంస్థాయి పారిశుధ్య కమిటీకి ఇప్పటి వరకు కేవలం రూ.10 వేలు మాత్రమే విడుదల చేసేవారు. అత్యవసర మందులు, ఇతర పనులకు ఈ నిధులు ఏమాత్రం సరిపోయేవికావు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం ఈ నిధులను రూ.50 వేలకు పెంచటంతో వారి సమస్య కొంత మేర పరిష్కారమైనట్లయింది. జిల్లాలో 102 వెల్‌నెస్ కేంద్రాలు, 17 పీహెచ్‌సీలు, 5 యూపీఎస్ కేంద్రాల్లో జనారోగ్య సమితిలు అమలులో ఉన్నాయి. జేఏఎస్ కమిటీలో చర్చించి అవస రమైన మందుల కొనుగోళ్లు, కేంద్రం పరిధిలో మరమ్మతులు, పారిశుధ్య పనులు చేయించుకోవటానికి ఇబ్బందులు తొలగినట్లయింది.

జేఏఎస్ కమిటీలు ఇలా...

ఆరోగ్య ఉప/ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రం పరిధిలో గ్రామ పారిశుధ్య కమిటీ స్థానంలో ఏర్పాటైన జన ఆరోగ్య సమితి(జేఏఎస్)కి ఛైర్మన్ గ్రామ సర్పంచ్, కో ఛైర్మన్‌గా పీహెచ్‌సీ వైద్యాధికారి వ్యవహరించనున్నారు. గ్రామీణ/మండల పీహెచ్‌సీ జన ఆరోగ్య సమితికి జెడ్పీటీసీ సభ్యులు, పట్టణ పీహెచ్‌సీల్లో వార్డు కౌన్సిలర్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఏఎన్‌ఎం, ఐకేపీ, మండలస్థాయి అధికారులు ఉండనున్నారు. సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల పరిధిలో ×రోగి కల్యాణ సమితి×లు ప్రతీ మూడో శనివారం విధిగా సమావేశం నిర్వహించి ప్రజారోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తీర్మానాలు చేస్తారు.

జన ఆరోగ్య సమితులు కీలకం



జన ఆరోగ్య సమితుల ద్వారా వ్యాధులను ప్రబలకుండా ఈ కమిటీలు ఎంతో దోహదపడతాయి. వీటిని గ్రామీణ, మండల స్థాయిలో ఏర్పాటు చేస్తాం. గ్రామ రూ.50 వేలకు పెంచటంతో సమితి సభ్యులు ఉత్సాహంగా పనిచేస్తూ వైద్యసేవలు విస్తృతం చేస్తారు.

– శ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్‌వో